క్లుప్తంగా

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి సన్మానం



ఎంపీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బద్దం వెంకట్‌రెడ్డి, పలు గ్రామాల కాంగ్రెస్ శ్రేణులు తదితరులు ఉన్నారు.

ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం

అర్వపల్లి : కేరళ ఆయుర్వేద పంచకర్మ వైద్యం ద్వారా అన్నిరకాల ఆరోగ్య సమస్యలు పరిష్కారమవుతాయని సూర్యాపేట కేరళ ఆయుర్వేద పంచకర్మ వైద్యశాల డాక్టర్ జోమోన్ తెలిపారు. అర్వపల్లిలో ఆయుర్వేద పంచకర్మ వైద్యంపై ఆదివారం స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్మ వైద్యం ప్రాముఖ్యత తెలియజేసి కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్యంతో పక్షవాతం, మెడ, నడుంనొప్పి, సోరియాసిస్, మధుమేహం, కిడ్నీలలో రాళ్లు, బరువుతగ్గడం, సైనసైటీస్, ఫైల్స్ తదితర వ్యాధులను నయం చేయవచ్చని చెప్పారు. మెడ, నడుం నొప్పికి సంబంధించి ఆపరేషన్లు అవసరమైన వారికి కూడా పంచకర్మ ద్వారా ఎలాంటి ఆపరేషన్ లేకుండా సాధారణ బాడీమసాజ్, స్టీమ్ బాత్ ద్వారా నయం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేరళ రాష్ట్ర పంచకర్మ థెరపిస్ట్‌లు అబిన్, చాలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎంపీపీ భర్తకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మీనర్సయ్యయాదవ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం ఎంపీపీ మన్నె రేణుక భర్త, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మన్నె లక్ష్మీనర్సయ్యయాదవ్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో సూర్యాపేటలో ఉన్న అతడిని ఆదివారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వైద్యం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, పందిరి యుగంధర్, పొట్టిపాక సైదులు, మన్నె సింహాద్రియాదవ్, కె.సాంబయ్య, జాని తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న యాకలక్ష్మి

నాగారం : తుంగతుర్తిలో సోమవారం జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు యాకలక్ష్మి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్, నాయకులు గుడపూరి వెంకటేశ్వర్లు, పద్మ, దేవరకొండ యాదగిరి, వెంకన్న, భిక్షం, స్వరూప పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ అభినందనీయం

మునగాల : విద్యార్థులకు దాతలు నోటు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని గ్రామ వాసి, వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. మునగాల మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కొనుగంటి రామరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారులు కొనుగంటి వీర్రాజు, వెంకటరాజులు గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.50వేల విలువగల నోటు పుస్తకాలను నంద్యాల కోటిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలను కోటిరెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నోటు పుస్తకాల దాతలు, ఎంపీపీ ఎలక బిందు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగమణి, పాఠశాల హెచ్‌ఎం నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఉద్యోగ సమాఖ్య సభ్యులు, గ్రామపెద్దలు ఎలక నరేందర్‌రెడ్డి, గ్రామస్తులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

- ఇద్దరు డాక్టర్లకు ఒక్కరే విధులు
- రెండు సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీ
- ఏడాది నుంచి మంజూరు కాని ఎన్‌క్యూఏఎస్ నిధులు



అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అర్వపల్లి : అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సిబ్బంది కొరత నెలకొంది. ఆస్పత్రిలో ఇద్దరు వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా కొన్నేళ్లుగా ఒక్కరితోనే వెళ్లదీస్తున్నారు. అలాగే ఇద్దరు మహిళా సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక ఏఎన్‌ఎం పోస్టు ఖాళీ ఏర్పడింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆశ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కరే డాక్టర్ ఉండటంతో అతను సెలవు పెట్టినా, సమావేశాలకు వెళ్లినా రోగులకు సిబ్బందే వైద్య సేవలందించాల్సి వస్తోంది. అలాగే ఆస్పత్రిలో కొన్ని వసతులు కూడా కల్పించాల్సి ఉంది. ఆస్పత్రిలో ఇన్వర్టర్ పవర్‌బ్యాకప్ లేక కరెంట్ ఎక్కువ సమయం పోయినప్పుడు సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు లభించినా..

అర్వపల్లి పీహెచ్‌సీ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు ఇచ్చింది. ఏడాది కిందట కేంద్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఈ ఆస్పత్రిని సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, మాతాశిశు సంరక్షణ, ప్రసవాలు, రోగుల పట్ల శ్రద్ధ, చికిత్స రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు అందించారు. అయితే ఈ గుర్తింపు వచ్చినందున ఏడాదికి సుమారు రూ. 3లక్షల వరకు నిధులను మంజూరు చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకు పైసా నిధులు విడుదల కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్వపల్లి పీహెచ్‌సీలో డాక్టర్, సిబ్బంది కొరతను తీర్చాలని, మౌలిక వసతులు కల్పించాలని ఆస్పత్రికి వచ్చే రోగులు కోరుతున్నారు.

సిబ్బంది కొరతను తీర్చాలి



24 గంటలు వైద్య సేవలందించే అర్వపల్లిలోని ఆస్పత్రిలో డాక్టర్, వైద్య సిబ్బంది కొరతను వెంటనే తీర్చాలి. అలాగే అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి. ఆస్పత్రిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలి.

– పుప్పాల నర్సింహారావు, పర్సాయపల్లి

ఇబ్బందులు లేకుండా సేవలు



అర్వపల్లి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉంది. కానీ నేను ఒక్కడినే ఉన్నా. అయినప్పటికీ రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. సిబ్బంది కొరత విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఆస్పత్రికి ఏడాది కిందటే ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు లభించింది. దీనికి సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది.

– డాక్టర్ మణిదీప్, మండల వైద్యాధికారి

వెంకటనర్సయ్య సేవలు మరువలేనివి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడిగా, రైతు కూలీ సంఘం వ్యవస్థాపకుడిగా, తొలితరం విప్లవోద్యమ నాయకుడిగా అలుగుబెల్లి వెంకట నర్సయ్య అందించిన సేవలు మరువలేనివని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్ అన్నారు. తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో నిర్మించే అలుగుబెల్లి స్మారక స్థూప నిర్మాణానికి ప్రజలు ఆర్థికంగా సహకరించాలంటూ ఆదివారం కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. అలుగుబెల్లి ఉన్నత వర్గ కుటుంబంలో జన్మించినా అసమానతలు లేని వ్యవస్థ కోసం పోరాడారని అన్నారు. నిజాం, రజాకారుల విధానాలను వ్యతిరేకిస్తూ ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. తన చివరి శ్వాస వరకు విప్లవోద్యమంలో కొనసాగాడని కొనియాడారు. నేటి యువత ఆయన ఆశయాల సాధన కోసం పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అలుగుబెల్లి వెంకటరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్ కుమార్, సబ్ డివిజన్ నాయకులు నల్లగొండ నాగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సక్క, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు సింహాద్రి, పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, పార్టీ గ్రామ నాయకులు అల్లి వీరయ్య, మల్లయ్య, వెంకన్న, రాములు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

నాగారం : ఫణిగిరి సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన వీబీఎస్ (ఒకేషనల్ బైబిల్ కోర్సు) క్లాస్‌లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు కరుణ యూత్ మహిళ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంఘ కాపరి జయరాజ్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ లాజర్, గోరంట్ల లక్ష్మయ్య, చిలుకూరి యాకోబు, చిలుకూరి జయరాజు, మేడే యాదగిరి, నీరుడు జోసెఫ్, పేరమళ్ల సామేల్ పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి తృతీయ వార్షికోత్సవాలు



వెలిశాలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సామేల్



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో బొడ్రాయి తృతీయ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక శాసన సభ్యుడు మందుల సామేల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్, మూల అశోక్‌రెడ్డి, వేణురావు, సుంకరి జనార్దన్, సతీష్ గౌడ్, తిరుమని యాదగిరి, బత్తుల శ్రీను, కిష్టునాయక్, నవీన్, వెంకన్న పాల్గొన్నారు.

పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే కిషోర్..

వెలిశాలలో జరిగిన బొడ్రాయి తృతీయ వార్షికోత్సవానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ దూపటి అంజలిరవీందర్, ఎంపీటీసీ సభ్యుడు పొన్నం సమతావెంకన్న, ఆకుల వీరయ్య, తెడ్డు భాస్కర్, బర్ల వెంకన్న, స్టాలిన్ యాదవ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు పూర్తి చేసేదెప్పుడో..

- నిధుల కొరతతో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ఆటంకం
- మద్దిరాలలో మధ్యలోనే నిలిచిన పనులు
- చందుపట్లలో శంకుస్థాపనకే పరిమితమైన వైనం



మద్దిరాలలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్

మద్దిరాల : మద్దిరాల, చందుపట్ల గ్రామాల్లో చేపట్టిన ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల పనులు ముందుకుసాగడం లేదు. మద్దిరాల మండలంలోని గ్రామాల్లో ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి 2017లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. దీంతో మండలంలోని 10 గ్రామాల్లో భవనాల నిర్మాణాలను ప్రారంభించారు. ఒక్కో భవనాన్ని రూ. 7.50లక్షలతో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పోలుమల్ల, రెడ్డిగూడెం, ముకుందా పురం, గోరెంట్ల, జి.కొత్తపల్లి, మామిండ్లమడవ, చిన్న నెమిల, కుక్కడం గ్రామాల్లో ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ మద్దిరాల మండల కేంద్రంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌ను స్లాబ్ వరకు మాత్రమే పూర్తి చేశారు. అదే విధంగా చందుపట్ల గ్రామంలో కమ్యూనిటీ హాల్ పనులు కేవలం శిలాఫలకానికే పరిమితమయ్యాయి. భవనాలకు నేటి వరకు నిధులు మంజూరు కానందున నిర్మాణ పనులు కొనసాగడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి ఎస్సీ కమ్యూనిటీ భవనాలను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భవనాలను పూర్తిచేయాలి



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరైన 10 ఎస్సీ కమ్యూనిటీ హాల్స్‌లలో 8 భవనాలను పూర్తి చేశారు. కానీ మద్దిరాల, చందుపట్ల గ్రామాల్లో భవనాలను నిర్మించాల్సి ఉంది. మద్దిరాలలో కొంతవరకు పనులు చేపట్టగా నిధుల కొరత వల్ల ఆటంకం ఏర్పడింది. వెంటనే అధికారులు స్పందించి భవనాలను పూర్తిచేయాలి.

– రాంపాక వెంకన్న, ఎమ్మార్పీఎస్ నాయకుడు

ఉన్నతాధికారులకు తెలియజేశాం

మండల కేంద్రంలోని మిగిలిన గ్రామాల్లో ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులను చేపడుతాం. చందుపట్ల గ్రామానికి సంబంధించి నిధులు మంజూరు కాకపోవడంతో పనులను ప్రారంభించలేదు. ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు తెలియజేశాం. త్వరలోనే ఆ భవన నిర్మాణ పనులను కూడా ప్రారంభిస్తాం.

– లావణ్య, పంచాయతీరాజ్ ఏఈ

పలువురికి ఆర్థికసాయం అందజేత



అర్వపల్లి : బాలుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న అర్వపల్లి వాసులు



మద్దిరాల : బియ్యం అందిస్తున్న దాతలు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన వెలుగు చంద్రశేఖర్ పెద్ద కుమారుడు ఉత్తమ్‌కుమార్ ఇటీవల స్థానికంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. దీంతో అతడు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కానీ బాధిత కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో అతడి వైద్య ఖర్చుల కోసం అర్వపల్లి గ్రామ అభివృద్ధి వాట్సప్ గ్రూప్ ద్వారా స్థానికులు విరాళాలు సేకరించారు. రూ.18,500 సేకరించి ఆదివారం బాధిత కుటుంబీలకు అందజేశారు. కార్యక్రమంలో దాతలు, స్థానికులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన అర్వపల్లి దేవస్థానం మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మాదం వీరారెడ్డి కుమారుడు సుందర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు గంగదెరి వెంకట్, నాయకులు దాసరి భిక్షం, రాచకొండ యాదగిరి, కె. ఉప్పలయ్య, నాగులు, దేవోజీ, సంపత్, దాసరి హేమంత్ కుమార్, లింగయ్య, యుగెందర్ పాల్గొన్నారు.

రాంబాయమ్మ మృతికి సంతాపం

మద్దిరాల : జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన బొబ్బిలి రాంబాయమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. దీంతో కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పులిగిల్ల లింగయ్య యాదవ్ ఆదివారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి అర క్వింటా బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కన్న వెంకటయ్య, వర్రె లింగయ్య, కన్న మల్లయ్య, బొబ్బిలి వీరస్వామి, సుధాకర్, ఉప్పలయ్య, వెంకన్న, నాంచారి, కన్న రాములు, తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి రూ.50వేల విరాళం



విరాళం అందజేస్తున్న నాయకులు

తుంగతుర్తి : మండల పరిధిలోని సంగెం గ్రామంలో పునీత జోజప్ప చర్చి నిర్మాణానికి మాజీ శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ గతంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.50,000 విరాళం అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆ నగదును ఆదివారం చర్చి నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌కు చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏశమల్ల సుశీలసామేల్, ఎంపీటీసీ కలకోట్ల ఏలేజర్, మల్యాల రాములు, జటంగి రవి, ఏశమళ్ల రామచంద్రు, ఏశమళ్ల మాణిక్యం, చెడిపాక వెంకన్న, జటంగి మల్లయ్య, మల్యాల వెంకన్న, ఏశమళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న బడిబాట



అర్వపల్లి : కాసర్లపహాడ్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నాగారం : పసునూర్‌లో..

అర్వపల్లి : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం మండల వ్యాప్తంగా కొనసాగుతోంది. జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్‌లో ఆదివారం హెచ్‌ఎం డి.యల్లయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. అలాగే అర్వపల్లిలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సీహెచ్. నర్సయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కరపత్రాలు పంచుతూ ఇళ్లు, దుకాణాలు తిరుగుతూ ప్రచారం జరిపారు. వంద శాతం ఫలితాలు సాధిస్తున్న తమ పాఠశాలకు పిల్లలను పంపాలని ఈ సందర్భంగా తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు ఆర్.రాంబాబు అన్నారు. ఆదివారం పసునూర్ గ్రామంలో ప్రాథమిక, జెడ్పీహెచ్‌ఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన గుణాత్మక విద్య అందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, 2జతల దుస్తులు అందిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సైదులు, ఆర్.సైదులు, ఎం.వెంకట్‌రెడ్డి, పి.ప్రేమయ్య, వై.శివకుమార్, ఎస్.బాలకిషన్, బి.సుందర్‌రావు, టి.రమాదేవి, ప్రవీణ్, శ్రీదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఫణిగిరి అధ్యక్షుడిగా తీగుళ్ల లక్ష్మణ్

నాగారం : ఐఎన్‌టీయూసీ ఫణిగిరి గ్రామశాఖ నూతన అధ్యక్షుడిగా తీగుళ్ల లక్ష్మణ్ ఆదివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆలకుంట్ల బాలక్రిష్ణ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మణ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ నియామకానికి సహకరించిన ఐఎన్‌టీయూసీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాంరెడ్డి, నర్సింహారెడ్డి, గట్టు లక్ష్మీకాంత్, శేఖర్‌రెడ్డి, అందే బాలరాజు, వీరమల్లు, బాబేష్, మహేష్, భాను ప్రకాష్, అవిలయ్య, మల్లేష్, వెంకన్న, లింగయ్య, జాన్‌వెస్లీ, కరుణాకర్, రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

తిరుమలగిరి : భారత ప్రధానిగా నరేంద్రమోదీ మూడవసారి ప్రమాణ స్వీకారం చేసి అధికారం చేపట్టిన సందర్భంగా ఆదివారం బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.యాదగిరి, సీహెచ్.హన్మంతు, ఎం.వెంకట్‌రెడ్డి, బంగారి, సోమయ్య, సుభాష్‌రెడ్డి, యాకవరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మూడోసారి ప్రధాని కావడంపై హర్షం

ఆత్మకూర్ (ఎస్) : దేశ ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి, టెలికం అడ్వైజరీ కమిటీ బోర్డు మెంబర్ సంద్యాల సైదులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతీయులంతా మోదీ పాలనను స్వాగతిస్తున్నారని తెలిపారు. ప్రధానిగా నరేంద్రం మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టడంతో మండల వ్యాప్తంగా బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చివ్వెంల : బి.చందుపట్లలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

చివ్వెంల : మండల పరిధిలోని బి.చందుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1991–92 సంవత్సర పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుని, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు పాఠశాలలో ఆటపాటలతో గడిపారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమయ్య, ప్రభాకర్, వెంకటయ్య, ఇమామ్, శ్రీను, వెంకటనర్సయ్య, పూర్వ విద్యార్థులు భాస్కర్, దేవేందర్, వీరయ్య, యల్లయ్య, వాసు, శ్రీను, మోహన శర్మ, రవి, అనిల్, రాములు, శిరీష, అంజమ్మ, వరలక్ష్మి, శ్రీలత, విజయ, సులోచన పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్) : ఇస్తాళాపురంలో..

ఆత్మకూర్(ఎస్) : ఇస్తాళాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులు రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, వెంకటేశ్వర్లులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాచకొండ వెంకన్న, నాయిని సతీష్, మానుపూరి రామక్రిష్ణ, ఇరుగు మధుకర్, ఇరుగు నవీన్, తూడి రమేష్, కవిత, సరిత, సుకన్య, సుజాత, గుగులోత్ రమేష్, గంధం మల్లేష్, నాగుల్ మీరా, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009–2010 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని సత్యగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సతీష్, నాగేంద్రబాబు, లక్ష్మణ్, శివగౌడ్, ప్రదీప్, కొండల్, విజయ్, నజీర్, సూరి తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

అధ్వానంగా కాలువ కట్టదారులు

అర్వపల్లి : తిరుమలగిరి నుంచి జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం వరకు ఉన్న ఎస్సారెస్పీ ప్రధాన కాలువ, మైనర్, సబ్‌మైనర్ల వెంట కాలువ కట్టదారులు వర్షాలకు అధ్వానంగా మారాయి. ఈ కాలువలు నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నిర్వహణ లేకపోవడంతో కట్టదారులు గుంతలమయమయ్యాయి. వర్షాలకు ఈ గుంతలలో వర్షపు నీరు చేరి రైతులు, ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.



సీతారాంపురం సమీపంలో 71డీబీఎం కాలువ వెంట అధ్వానంగా మారిన దారి



పర్సాయపల్లి వద్ద..



కాసర్లపహాడ్ వద్ద..

ఘనంగా గట్టు మైసమ్మ జాతర

మోతె : మండల పరిధిలోని ఉర్లుగొండ గ్రామంలో ఆదివారం గట్టు మైసమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గట్టు మైసమ్మ తల్లి కృపతో ఉర్లుగొండ గ్రామస్తులు, భక్తులు ఆనందంగా ఉండాలని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు తీరే విధంగా వర్షాలు సమృద్ధిగా కురువాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కోదాడ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ పుల్లారావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ మైనంపాటి గుర్వారెడ్డి, కేఎల్‌ఎన్ ప్రసాద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య, మామిడి వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.